రాష్ట్రానికి సిఎంనైనా కుప్పానికి ఎమ్మెల్యేనే..

- గత ఐదేళ్ల విధ్వంస పాలనతో నిలిచిన అభివృద్ధి
- ఇక అన్‌స్టాపబుల్‌గా కుప్పం అభివృద్ధి
- మోడల్ నియోజకవర్గం, టూరిజం హబ్‌గా మార్చేందుకు నిర్దిష్ట ప్రణాళిక
- పీపీపీ విధానంతో కుప్పం దశాదిశ మారుస్తా..
- ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగానే అడుగులు
- స్వర్ణకుప్పం విజన్-2029 డాక్యుమెంట్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఎంపి, పూతలపట్టు ఎమ్మెల్యే



ప్రజాశక్తి- గుడిపల్లి: రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అయినా కుప్పానికి ఎమ్మెల్యేనే అని, 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించిన కుప్పం ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత పాలకులు కక్షపూరితంగా కుప్పం అభివృద్ధిని అడ్డుకున్నారని, టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై కుప్పం అభివృద్ధి అన్ స్టాపబుల్ అని, అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకే స్వర్ణకుప్పం విజన్ -2029 నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. కుప్పంలోని ద్రవిడ యూనివర్సిటీలో స్వర్ణ కుప్పం విజన్ -2029 డాక్యుమెంట్‌ను చంద్రబాబు సోమవారం ఆవిష్కరించారు. ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రి వివరించారు.

కుప్పంలో అభివృద్ధి పరుగులు

2024 ఎన్నికల తర్వాత 2వ సారి కుప్పం వచ్చానని చంద్రబాబు అన్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసి దానికి స్పెషల్ ఆఫీసర్‌గా యువ ఐఏఎస్‌కు బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. కుప్పంలో దాదాపు 65 వేల కుటుంబాల వరకూ ఉన్నాయని ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకున్నామని, ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేస్తామని అన్నారు. కుప్పం నియోజకవర్గంలో పేదరికం లేకుండా ఉండేందుకు ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా పైకి తీసుకొస్తామని, పెద్ద ఎత్తున పరిశ్రమలు స్థాపించి 15వేల ఉద్యోగాల కల్పన, 100 శాతం సోలరైజేషన్, రహదారుల నిర్మాణం, జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు, నైపుణ్య శిక్షణా కేంద్రాల ఏర్పాటు, కార్గో ఎయిర్‌పోర్టు పూర్తిచేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం, అర్హులకు పెన్షన్లు, దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు పంపిణీ, సూపర్ స్పెషాలిటీ ఏరియా ఆస్పత్రి నిర్మాణం, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత నీరు, ఎలక్ట్రికల్ సైకిళు పంపిణీ, డ్వాక్రా మహిళలకు ప్రోత్సాహకాలు అందించి కుప్పం నియోజకవర్గాన్ని మోడ్రన్, టూరిజం హబ్‌గా తయారు చేయడం వంటి నిర్ధిష్ట ప్రణాళికతో స్వర్ణ కుప్పం విజన్ 2029 రూపొందించినట్లు తెలిపారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం..

గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంస పాలన జరిగిందని, వ్యవస్థలను భ్రష్టుపట్టించారని, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని అన్నారు. ఎవరినీ స్వేచ్ఛగా మాట్లాడనివ్వలేదని, ప్రజలను అణిచివేశారని, వారికి మంచి చేయాలనే ఆలోచన లేదని విమర్శించారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టాలంటే వైసీపీని ఓడించాలని తాను, నరేంద్రమోదీ, పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుకు మీరు స్పందించి బ్రహ్మరథం పట్టారని, తాను సుధీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేశానని పదేళ్లు ప్రతిపక్షనేతగా పనిచేశానని రాజకీయాలంటే ఆషామాషీగా తీసుకోకుండా పబ్లిక్ పాలసీ తీసుకొస్తే చరిత్ర తిరగరాయొచ్చుని భావించానని అన్నారు. అదే అమలు చేసి అద్భుత ఫలితాలు సాధించానన్నారు. ఒక సమర్థ నాయకుడు ఉంటే ఏదైనా సాధ్యమని నిరూపించిన పార్టీ తెలుగుదేశమే అన్నారు. ద్రవిడ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీఆర్ దే అని దురదృష్టవశాత్తు దేవాలయం లాంటి యూనివర్సిటీలను కూడా రాజకీయ పునరావాస కేంద్రాలుగా వైసీపీ వాడుకుందని, వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో

ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం

తాను నాడు విజన్-2020 అని నినాదం ఇస్తే కొంతమంది హేళన చేశారని, 1995లో తాను సీఎంగా ఉన్నప్పుడు సైబరాబాద్ ప్రాంతమంతా రాళు, రప్పలు అని అక్కడ ఐటీని అభివృద్ధి చేసేందుకు హై టెక్ సిటీ నిర్మించానని, ప్రపంచంలోనే ఐటీ సిటీగా హైదరాబాద్ తయారవుతుందని ఆనాడే చెప్పానని గుర్తు చేశారు. నాడు టీడీపీ హయాంలో వేసిన పునాది కారణంగా తలసరి ఆదాయంలో నేడు దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కష్టపడి పనిచేస్తే సాధించలేనిదేమీ లేదని, మనమంతా సమిష్టిగా పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు అన్నారు. రాష్ట్రంలో నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, జూన్ లోగా హంద్రీనీవా జలాలను పాలారు వాగుకు తీసుకొస్తామన్నారు. ఈ వాగుపై చెక్ డ్యామ్ కూడా నిర్మిస్తా. నీటి భద్రత, కరవు నివారణ కోసం గోదావరి నీళ్లను బనకచర్లకు తీసుకెళ్లేందుకు ప్రణాళిక రూపొందించామని, టెక్నాలజీ సాయంతో వ్యవసాయం లాభసాటిగా మార్చడంతో పాటు ఖర్చు తగ్గించే విధానాలపై దృష్టి పెట్టానని తెలిపారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదాన్ని ప్రజల్లోకి ఉధృతంగా తీసుకెళ్తున్నామని భవిష్యత్‌లో డీప్ టెక్నాలజీ దే హవా అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చి 150 సేవలు అందించబోతున్నామన్నారు. దక్షిణ భారతదేశంలో సంవత్సరాల తరబడి జనాభా పెరుగుదల రేటు క్షీణించడం ఆందోళన కలిగిస్తోందని ఏపీ జనాభా గ్రోత్ రేట్ 1.5శాతం దక్షణ కొరియా 5శాతంగా ఉందని దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని సీఎం చంద్రబాబు అన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం ద్రవిడ యూనివర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానమిచ్చి కుప్పం అభివృద్ధికి తీసుకుంటున్న ప్రణాళికలను వివరించారు.

సిఎంకు ఘనస్వాగతం

కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం బెంగళూరు విమానాశ్రయం నుండి మధ్యాహ్నం 12.05 గంటలకు గుడుపల్లి మండలం, ద్రవిడ యూనివర్సిటీ ఇందిరా గాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేరుకున్నారు. సిఎంకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అనంతపురం రేయింజ్ డిఐజి షిమోషీ, ఎస్పీ మణికంఠ చందోలు, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, డిఎఫ్ఓ భరణి ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు ఎన్.అమరనాథ్ రెడ్డి, గురజాల జగన్ మోహన్, డాక్టర్ వియం. థామస్, డాక్టర్ కె.మురళీమోహన్, గాలి భానుప్రకాష్, కె.ఆదిమూలం, పులివర్తి నాని, మాజీ కేంద్ర మంత్రి పనపాకం లక్ష్మి, మాజీ ఎమ్మెల్సీలు రాజసింహులు, గౌనివారి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్.మనోహర్, సుగుణమ్మ, పుంగనూరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జి చల్లాబాబు రెడ్డి, సిఆర్.రాజన్, నరసింహ యాదవ్, శ్రీధర్‌వర్మ, దగ్గుబాటి వెంకటేశ్వర రావు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. కుప్పం నియోజకవర్గం ప్రజాప్రతినిధులను, పార్టీ నాయకులను ముఖ్యమంత్రి పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి బయలుదేరారు.

ద్రవిడ యూనివర్సిటీలో స్వర్ణ కుప్పం విజన్ -2029 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిన సిఎం, ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్యేలు

గజమాలతో స్వాగతం పలికిన మండల నాయకులు

కుప్పం నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల పర్యటన భాగంగా మొదటి రోజైన సోమవారం గుడిపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీ ప్రాంగణానికి చేరుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ హేమాంబర్ గౌడ, మాజీ జెడ్పిటిసీ బెటప్ప నాయుడు, సుబ్రమణి, గోవిందస్వామి, డీకే.చంద్ర, ఎల్లప్ప, గోవిందస్వామి, మూసామి శెట్టి గజమాలతో సత్కరిస్తూ ఘనంగా స్వాగతం పలికారు.

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న దృశ్యం

సౌరవిద్యుత్ ప్రారంభం

ఐటిసి కన్సూర్‌తో ఒప్పందం

సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

కుప్పం రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం మండలం నడుమూరు గ్రామానికి చేరుకుని సౌర్య విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులైన సుబ్రహ్మణ్యం, నాగరాజు, పద్మావతి, చిన్నస్వామి కుటుంబసభ్యులతో ముచ్చటించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొన్నారు. కుప్పం ఏరియా డెవలప్మెంట్ అతారిటీ ఐటిసి కన్సూర్‌తో కార్బన్ ఉద్గారాలను నికర సున్నాకి చేర్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ పిఎం సూర్య ఘర్ యోజన పథకంను కుప్పంలో ఫైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించినట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలకు విద్యుత్ భారం తగ్గడమే కాకుండా, మిగులు విద్యుత్‌ను అమ్ముకొని సొమ్ము చేసుకొనే అవకాశం ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన విధంగా కుప్పం నియోజకవర్గన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే కార్బన్ ఉద్గారాలను నికర సున్నాకి చేర్చేలా ఐటిసి కన్సూర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. కుప్పం అభివృద్ధిని ఆపడం ఎవ్వరి తరం కాదని, 2029 కల్లా కుప్పంను స్వర్ణ కుప్పంలా తీర్చిదిద్దుతామన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, నెడ్ క్యాప్ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్ బాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా సుమిత్ కుమార్, జెసి జి.విధ్యాదరి, కడా పీడి వికాస్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ హీమవంశీ, ఏపిఎస్ ఆర్‌టిసి వైస్‌చైర్మన్ పిఎస్.మునిరత్నం, టిటిడి బోర్డు మెంబర్ శాంతారాం, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా

భూముల రీ సర్వే

- మండలానికి ఓ గ్రామం చొప్పున ఎంపిక
- జిల్లాలో 31 గ్రామాల్లోని 30,850 ఎకరాల్లో రీసర్వే

ప్రజాశక్తి- చిత్తూరు

గత ప్రభుత్వంలో జరిగిన జగనన్న భూహక్కు- భూరక్ష పథకంలో రీసర్వే చేపట్టారు. అయితే గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రీ సర్వేలో అనేక తప్పులు దొర్లాయి. రీ సర్వేలో భూముల కొలతల్లో తేడాలు రికార్డులలో తారుమార్లు అనేక వ్యత్యాసాలు ఉండడంతో ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం రీ సర్వేలు సమస్యను దృష్టిలో పెట్టుకొని రీ సర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులో 12,250 పైగా దరఖాస్తులు రైతుల నుంచి భూసమస్యలపై అందాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం రీ సర్వే ను పక్కాగా రైతుల సమక్షంలోని చేపట్టాలని ఉద్దేశంతో జిల్లాలోని 31 మండలాల్లో ఒక రెవెన్యూ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని రీ సర్వే చేపట్టనున్నారు.

చిత్తూరు జిల్లాలో 31 మండలాలు ఉన్నాయి. ఇందులో రెవెన్యూ 822 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఈ సర్వే పూర్తి అయినవి 329 గ్రామాలు. గతంలో రీ సర్వే చేపట్టడంలో తప్పులు దొర్లడంతో కూటమి ప్రభుత్వం జిల్లాలోని 31 మండలాల్లో ఒక రెవెన్యూ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని ఈ సర్వే చేపట్టనున్నారు. ఈ గ్రామాల్లో రీసర్వేను పగడ్బందీగా నిర్వహించి రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని లక్ష్యంగా ఎంచుకుంది. 31 మండలాల్లో ఈ సర్వేను పునఃప్రారంభించే విధంగా చర్యలు చేపట్టింది. మొత్తం 30,850 ఎకరాల్లో రీ సర్వేను చేపట్టనున్నారు. ఈ మేరకు సర్వే భూ రికార్డుల శాఖ అధికారులు సర్వేకు సన్నిద్ధమవుతున్నారు.

రీ సర్వేలో లోపాలు.. రైతులకు శాపాలు..

ఉపగ్రహానుసంధానంతో డిఫెన్స్ గ్లోబల్ పొజిషన్ సిస్టం (డిజిబిఎస్) ద్వారా నిర్ణయిత భూముల హద్దుల్లో అంగుళం తేడా లేకుండా రీ సర్వే రూపకల్పన చేసినట్లు ప్రభుత్వం చెబుతుంది. అయితే పలు ప్రాంతాల్లో భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు చోటు చేసుకుంటున్నాయి. రైతుల పత్రాల వద్ద అంగీకారం తీసుకున్న తర్వాత పలువు రైతులుకు పాసు పుస్తకంలో తప్పులు దొర్లాయి. లోపాల సవరణకు పలువురు రైతులు జిల్లా అధికారుల దృష్టికి భూ సమస్యలతో రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఒక్కో రీ సర్వే బృందానికి 20 ఎకరాలు

రీ సర్వేలో ప్రణాళికలో భాగంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని రీ సర్వే చేశారు. దీనికి ఇద్దరు గ్రామసర్వేలు, ఒక విఆర్ఓ, రెవెన్యూ అధికారితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి బృందం రోజుకి కనీసం 20ఎకరాలు తగ్గకుండా సర్వే చేసి అదే రోజున ఆన్లైన్లో పూర్తి వివరాలు నమోదు చేయాలి. ఇప్పటికే మండలానికి ఒక గ్రామం చొప్పున ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి భూమి సరిహద్దు రాళ్ల గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నారు. గ్రామాల్లోని రైతుల సమక్షంలో వారి భూములను పక్కాగా ఈ సర్వే చేపట్టనున్నారు.

రైతుల భూముల్లో రీ సర్వే చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్ ఫోటో)

దళితులపై దాడి చేసిన వారిని

కఠినంగా శిక్షించాలి

- బాధితులను పరామర్శించిన కేవిపిఎస్ నేతలు

గ్రామస్తులతో మాట్లాడుతున్న కేవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, విజయపురం

నగిరి మండలం తడకపేట దళితులపై దాడి చేయడమే కాకుండా వారి వాహనాలు తగలబెట్టిన అగ్రకులస్తులపై చర్యలు తీసుకొని దళితులకు రక్షణ కల్పించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కాంజీవరం సురేంద్రన్, అన్నూరి ఈశ్వర్ డిమాండ్ చేశారు. తెలుగు దేశం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నామని అహంకారంతో దళితులు గ్రామం వదిలి వెళ్ళిపోవాలని ఆంక్షలు విధించడం ఏమిటని ప్రశ్నించారు. గొడవ సద్దుమణిగిన తరువాత కూడా రకరకాల పద్ధతుల్లో రాజకీయ కక్షలతో దళితులను బలి చేయడం దుర్మార్గమైన కులదురంకార చర్యగా అభివర్ణించారు. రాజ్యాంగం ప్రకారం అందరూ సమానమైనప్పటికీ ఆ గ్రామంలో దళితులను వివక్ష చూపడం, దళితుల పిల్లల్ని స్కూల్‌కి సైతం రాన్వికపోవడం సిగ్గుచేటు అన్నారు. దెబ్బలు తగిలి ఆసుపత్రిలో ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించాలని, సమస్యలను రాజకీయాలకు ముడిపెట్టి దళితులకు మహిళలకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలం అయ్యారని అన్నారు. అధికారులు జోక్యం చేసుకొని కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మహిళలకు పిల్లలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వారి వెంట పెరుమాళ్, షణ్ముగం ఉన్నారు.

దళితులను రిమాండ్‌కు పంపడం హేయమైన చర్య

పెద్దపంజాణి: అగ్రవర్ణాల వారిచే దెబ్బలు తిని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళితులను రిమాండ్‌కు పంపడం హేయమైన చర్య అని జాతీయ మానవహక్కులు అవినీతి నిర్మూలన సంస్థ, మాల మహానాడు, జై భీమ్ సంఘం, బిల్డింగ్ అసోసియేషన్ నాయకులు సోమవారం తీవ్రంగా ఖండించారు. సోమవారం మండలం కేంద్రంలో తిప్పన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగిరి నియోజకవర్గం తడుకు పేటలో దళితులపై అగ్రవర్ణాల వారు చేసిన దాడికి నిరసనగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మానవ హక్కుల సంస్థ జిల్లా అధ్యక్షులు డివి.మునిరత్నం మాట్లాడుతూ అగ్రకులస్తుల చేతిలో దాడికి గురై దళితులను అరెస్ట్ చేసినప్పుడు పోలీసులు గాయపరిచిన అగ్రకులస్తులను ఎందుకు అరెస్టు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. దళితులను గ్రామం వదిలి వెళ్లిపోవాలని ఆదేశించే అధికారం అగ్ర కులస్తులకు ఎవరు ఇచ్చారని నిలదీశారు. అధికార ప్రభుత్వం తమదని అగ్రవర్ణాల వారు, దళితులపై పెత్తనం చలాయిస్తుంటే పోలీసులు చోద్యం చూస్తూ ఉండడం సరికాదని హితవు పలికారు. ఇటువంటి అనాగరికమైన చర్యను స్థానిక ఎమ్మెల్యేతో పాటు దళిత ఎమ్మెల్యేలు, అధికార పార్టీలో కొనసాగుతున్న దళిత నాయకులు బహిరంగంగా ఖండించాలని డిమాండ్ చేశారు. నాయకులు అమర నారాయణ, టి.మునిరత్నం, సాంబశివ, ఆనంద, చంద్రమౌళి, సుబ్రహ్మణ్యం, రెడ్డప్ప, చంద్ర, మునిరాజ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఓటేరిపాళ్యంలో వైద్యసేవలు

గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: 'జర్వాలతో వణుకుతున్న ఓటేరిపాళ్యం' అనే శీర్షికన సోమవారం ప్రజాశక్తి తెలుగు దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. మంగళవారం ఓటేరిపాళ్యంకు వైద్యబృందం, అధికారులు చేరుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం లోపం కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. పంచాయతీ సిబ్బంది వెంటనే మురుగునీటి కాలువల్లో వ్యర్థాలను శుభ్రం చేయడంతోపాటు, పేడదిబ్బలను ఊరికి దూరంగా ఉంచాలని, గ్రామంలోనీ వీధుల్లో చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిహెచ్‌సి డాక్టర్ విజయచంద్ర గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, దోమల నివారణ గురించి అవగాహన కల్పించారు.

మళ్లీ ముఖానికి మాస్కులు..!

- జనాన్ని బెంబేలెత్తిస్తున్న హెచ్ఎంపివి వైరస్
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కోవిడ్.. కోవిడ్.. మొదటి, రెండు, మూడు విడతల కోవిడ్ వైరస్ ప్రపంచాన్ని గడగడలాడించింది.. మొదటి వేవ్ పెద్దగా ప్రాణనష్టం కలిగించకపోయినా రెండు, మూడు కరోనా వేవ్‌లు అధిక సంఖ్యలో ప్రజల్ని బలితీసుకుంది. నేటికీ నాటి కరోనా జ్ఞాపకాలు ప్రజల మరిచిపోలేకపోతున్నారు. కరోనా కారణంగా అప్తులను, బంధువులను పోగొట్టుకున్న వారు ఇప్పుడిప్పుడే కొలుకుంటున్న తరుణంలో దాదాపు రెండేళ్ళ తరువాత తిరిగి హెచ్ఎంపీవీ వైరస్ ప్రభావంతో చైనాలో పిట్టాలా జనం రాలిపోతున్నారంటూ సోషియల్ మీడియా ప్రచారంతో నాటి కరోనా జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశంలో హెచ్ఎంపీవీ (వైరస్) కేసులు వెలుగు చూడటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ పూర్తి అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో హెచ్ఎంపీవీ కేసులు ఇప్పటివరకు ఒక్కటి కూడా నమోదు కాలేదని అధికారులు ముఖ్యమంత్రికి తెలియచేశారు. రాష్ట్రంలోకి కొత్తగా వచ్చి వెళ్లే వాళ్ళపై దష్టి పెట్టాలని, ఎక్కడ అనుమానం ఉన్నా పూర్తిస్థాయి పరీక్షలు జరపాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కుప్పం నుండీ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో మంత్రి సత్యకుమార్, వైద్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

షేక్ హ్యాండ్స్ వద్దు..

హెచ్ఎంపీవీ వైరస్ కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రజలకు కీలక విజ్ఞప్తి చేసింది. నమస్కారం ముద్దు.. హ్యాండ్ షేక్ వద్దు' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. షేక్ హ్యాండ్స్ కారణంగా వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపింది. సీజనల్ వ్యాధులు తరుచుగా పిల్లలు, వృద్ధుల్లో అధికంగా వచ్చే అవకాశం ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూచిస్తోంది. హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందితే శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కాబట్టి వీలైనంత వరకు ఈ వైరస్ నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైరస్ సోకిన వారికి షేక్ హ్యాండ్ ఇచ్చినా, తాకినా వైరస్ సోకవచ్చు. దగ్గు, తుమ్ముల నుంచి వచ్చే తుప్పిర్లు ద్వారా కూడా వైరస్ వ్యాపిస్తుందని సూచించింది. ఈ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో చల్లని గాలులకు దూరంగా ఉండడంతో పాటు దూరప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిది.

పాటించాల్సిన జాగ్రత్తలు..

ప్రతి ఒక్కరూ విధిగా మాస్కు ధరించాలి. తరుచుగా సబ్బు లేదా శానిటైజర్‌తో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. జనసమూహాలకు దూరంగా ఉండాలి. భౌతిక దూరం తప్పనిసరిగా పాటించాలి. రోగనిరోధక శక్తిని పెంపొందించే ఆహారం తీసుకోవాలి. వీలైనంత వరకు ఇంట్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, దగ్గు విపరీతంగా ఉంటే.. తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలి. మరోవైపు గత కరోనా సమయంలో కరోనా సోకిన వారికి బూస్టర్ వ్యాక్సిన్ వేసుకున్నారు. ఇలా వ్యాక్సిన్ వేసుకున్న వారికి ఉదరకోశ సమస్యలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వైద్యఆరోగ్యశాఖ ప్రస్తుత హెచ్ఎంపీవి వైరస్‌పై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిగా అవగాహన కల్పించాల్సిన అవసరముంది..

వైరస్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం

హెచ్ఎంపీవి వైరస్ కేసులు మన జిల్లాలో నమోదు కానప్పటికీ వైద్య ఆరోగ్యశాఖను అప్రమత్తం చేసి ఇప్పటికే జలుబు, దగ్గు విపరీతంగా ఉండి ఇబ్బంది పడుతున్న వారికి పరీక్షలు నిర్వహించడం జరుగుతోంది. శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యసలహాలు ఇవ్వాలని ఆదేశించాం. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తాం.

\- డాక్టర్ సుధారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని

2025 ఓటర్ల తుది జాబితా విడుదల

- జిల్లాలో 15,68,788 మంది ఓటర్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2025 జిల్లాలోని ఏడు నియోజవర్గాల ఓటర్లు తుది జాబితాను సోమవారం విడుదల చేశారు. చిత్తూరులోని ఏడు నియోజవర్గాల్లో స్త్రీ, పురుషులు తుది జాబితా ప్రకారం జిల్లాలో 15,68,788 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పురుషులు 7,20,079, స్త్రీలు 7,96,637మంది, థార్డ్‌జెడ్డర్స్ 72మంది ఉన్నారు. ఇక నియోజకవర్గాల వారిగా చూస్తే పుంగనూరు 2,39, 149, నగరి 2, 27.09, జీడి నెల్లూరు (ఎస్సీ రిజర్వాడ్ నియోజకవర్గం) 2,56,23, చిత్తూరు 2,35,570, పూతలపట్టు (ఎస్సీ రిజర్వాడ్ నియోజవర్గం) 2,21,638, పలమనేరు 2,69,065, కుప్పం 2,27, 034 తుది జాబితాలో ఓటర్లున్నట్లు గుర్తించారు. అలాగే సర్వీస్ ఓటర్ల 3,260, ఎన్ఆర్ఐ ఓటర్లు 168 మంది, పిడబ్ల్యూడి ఓటర్లు 23,499, 18 నుండీ 19 సంవత్సర వయసు గల ఓటర్లు 2,44,06 మంది ఉన్నట్లు 2025 ఓటర్లు తుదిజాబితా విడుదల చేశారు.

11న వడ్డెర ఓబన్న జయంతి వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 11న వడ్డెర ఓబన్న జయంతిని చిత్తూరులో ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యక్రమ ఆహ్వాన కమిటీ నాయకులు రవీంద్రరాజు తెలిపారు. నాగయ్య కళాక్షేత్రంలో వడ్డే ఓబన్న జయంతి సభ నిర్వహిస్తామన్నారు. ముందుగా గాంధీ విగ్రహ కూడలి నుంచి భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు ప్రజాప్రతినిధులు, వడ్డెర సంఘం రాష్ట్ర ముఖ్యనాయకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. తెలంగాణ తరహాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని విన్నవించారు. ఆర్థికంగా వెనుకబాటులో ఉన్న తమను పక్క రాష్ట్రాల్లో మాదిరిగా వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని విన్నవించారు. కులవృత్తుల వారికి పనిముట్లు, యంత్రాలకు నిధులు మంజూరు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందనీ ప్రభుత్వాన్ని కోరారు. సభ్యులు ధరణి ప్రకాష్, గుర్రప్ప, మురళి, బోడబండ్ల అశోక్, మణికంఠ, బాబు, హరిబాబు, సంజీవి, సుధాకర్ పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి: డీఈవో

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ నిబంధనల మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సోమవారం ఒక ప్రకటనలో జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి జిల్లాలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పొరబాట్లు జరిగే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే శనివారం మెనూ మార్పులను గమనించి రైస్, సాంబారు, స్థానికంగా లభించే కూరగాయల వేపుడు, స్వీట్ పొంగల్, రాగిజావా అందించాలన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీడీవో

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలం నెల్లేపల్లె సచివాలయం ఆవరణంలో సోమవారం ఆర్టీఐ నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహశీల్దార్ చంద్రశేఖర్, స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జాతీయ అధ్యక్షుడు పట్టాభి రెడ్డి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డీకె.కుమార్, జాతీయ సలహాదారు డాక్టర్ బాలు, నెల్లేపల్లె సర్పంచ్ గంగయ్య, మండల టిడిపి అధ్యక్షుడు స్వామి దాస్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి: ఎంఈవో

పిఆర్‌టియు క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎంఈవో

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఉపాధ్యాయులు సమయపాలన విధిగా పాటించాలని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. సోమవారం ఎమ్మార్సీలో పీఆర్టీయూ కాలమాన పట్టికను ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విధి నిర్వాహణలో సమయపాలన తప్పక పాటించాలని, అలాగే ఉత్తమ బోధన ద్వారా విద్యార్థుల సర్వోతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి జోగి గురుమూర్తి, మండల అధ్యక్షురాలు మునిలక్ష్మి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, దామోదరం, కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

మానవత్వం మాటలకేనా..

పవన్ కళ్యాణ్‌కు మాజీమంత్రి ఆర్కేరోజా సూటి ప్రశ్న

ప్రజాశక్తి- విజయపురం (నగరి): బెనిఫిట్‌షోకి వెళ్లిన సమయంలో అల్లు అర్జున్, పుష్ప2 టీం మానవత్వంలో వ్యవహరించలేదని ఆరోపించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేడు గేమ్ ఛేంజర్ సంఘటనలో ఎందుకు మానవత్వంతో నడుచుకోవడం లేదని మాజీ మంత్రి ఆర్కేరోజా సోమవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. గేమ్ ఛేంజర్ సినిమా ప్రిరిలీజ్ ఈవెంట్‌కి వెళ్లి ఇద్దరు అభిమానులు మణికంఠ, చరణ్‌లు మరణించడం బాధాకరమని అన్నారు. తన కోసం వచ్చిన ఇద్దరు అభిమానులు చనిపోయి 3 రోజులైనా డిప్యూటీ సీఎం కనీసం పరామర్శించకపోవడం అమానవీయమన్నారు. తెలంగాణలో అల్లు అర్జున్, పుష్ప టీమ్ మానవత్వంతో వ్యవహరించలేదన్న పవన్ ఇప్పుడు 3 రోజులైనా మరణించిన అభిమానుల ఇళ్లకు వెళ్లి ధైర్యం చెప్పకపోవడం దారుణమన్నారు. ఆ యువకుల తల్లులు, కుటుంబాల కన్నీటి రోదన కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పరామర్శించకపోగా వీరి మరణానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు వెయ్యకపోవడం కారణం అంటూ చౌకబారు రాజకీయం చెయ్యడం ఆయనకు తగదన్నారు. 7నెలలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్నది వారి ప్రభుత్వమే అని ఆయన మరచినట్లున్నారని అన్నారు. మీకు ఓట్లేసి గెలిపించిన ఆ యువకుల మరణానికి ఆ జిల్లాకు మంత్రిగా ఉన్న మీరు కారణం కాదా అని ప్రశ్నించారు. యువకుల మరణానికి ఎవరు కారణమో ఆయన గుండె మీద చెయ్యి వేసుకొని ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.

తాగునీటి బోరు మరమ్మతు

బాగు చేసిన బోరు నుండి పుష్కలంగా వస్తున్న తాగునీరు

ప్రజాశక్తి- సోమల: సోమల పంచాయతీ అడుసుపల్లి గ్రామంలోని తాగునీటి బోరుకు విద్యుత్ సరఫరా ఆగిపోయి గత ఆరు నెలలుగా ప్రజల దాహార్తిని తీర్చలేక పోయింది. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి మజాహర్ సోమవారం గ్రామానికి వెళ్లి పరిశీలించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ఆపై బోరు మోటారు స్టాటరు బాగు చేయించి నీరు వదలడంతో బోరులో నుండి తాగునీరు పుష్కలంగా వచ్చాయి, దీంతో గ్రామస్తులకు ఇదివరకు ఉన్న తాగునీటి బోరు ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని వాడుకలో లేని బోరు కూడా బాగు చేసి ప్రజలకు తాగునీరు అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న బ్యాంకు మేనేజర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి- కార్వేటినగరం: సేవాకార్యక్రమాలకు క్యారాఫ్ అడ్రస్సు రాస్ స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మునిరత్నం అని స్టేట్ బ్యాంకు మేనేజర్ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం రాస్ అధినేత డాక్టర్ మునిరత్నం వర్థంతిని పురస్కరించుకుని కార్వేటినగరం వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ సేవాతత్వం, నిరాడంబర జీవిన విధానం కలిగిన పద్మశ్రీ అవార్డు గ్రహీత మునిరత్నం సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన ప్రస్తుతం మన మధ్య లేక పోయినప్పటికీ అనేక సేవలు చేసి అనేక మంది పేదవారి హృదయాల్లో నిలిచి పోయారని పేర్కొన్నారు. రాస్ అభ్యునతికి ఎంతో కృషి చేశారని, ప్రస్తుతం రాస్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉపాధి పొందుతున్నారని గుర్తుచేశారు. అనంతరం మునిరత్నం చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రకాష్, వృద్ధులు పాల్గొన్నారు.

బియ్యం, దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రిమ్మర్స్ మానసిక వికలాంగుల పునరావాస కేంద్రానికి శ్రీపురం సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్ట్, మదనపల్లి త్రివేణి ఏజెన్సీస్ పద్మజ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్లైడర్ నిచ్చెనను, ఊయలను, బియ్యం బస్తా, స్టీలు డ్రమ్ము, దుప్పట్లు, చాపలు వితరణగా అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ కేంద్రంలో చదువుతున్న మానసిక వికలాంగులకు చదువుతోపాటు శారీరక, మానసిక ఉల్లాసం కోసం ఈ జారుడు బండ, ఊయలు ఏర్పాటు చేసినట్లు శ్రీపురం సీతారామయ్య తెలిపారు. ఫౌండర్ డాక్టర్ సుధాకర్ పాఠశాల విద్యార్థులకు సహాయసహకారాలు అందిస్తున్న దాతలను దుశ్శాలవతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎంసి కమిటీకి శిక్షణ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం జడ్పీ హైస్కూల్లో ఎస్ఎంసి స్కూల్ కమిటీ చైర్మన్ సుధాకర్ అధ్యక్షతన సోమవారం ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర నాయుడు శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల బాధ్యతలు, విధులు పాఠశాలలో వారి బాధ్యతలను వివరించారు. అనంతరం స్కూల్ ఛైర్మన్, యాజమాన్య కమిటీ సభ్యులు స్కూల్లో మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం కమిటీ సభ్యులు శాంత కుమార్, రాఘవేంద్ర, టీచర్లు జ్యోతి, టీచర్లు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సిడి సర్వే తనిఖీ

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్సిడి సర్వేను సోమవారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ నడుమూరు గ్రామంలో తనిఖీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఈ సర్వేను చేపట్టాయని, రానున్న కాలంలో ఈ సర్వే ఆధారంగానే ప్రజలకు అవసరమైన వైద్య చికిత్సలు మందులు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటిలోని ప్రతి ఒక్కరిని తప్పకుండా స్క్రీనింగ్ చేసి వారికి ఎలాంటి జబ్బులు ఉన్నాయన్న విషయాన్ని ఆన్లైన్లో అప్‌డేట్ చేయాలన్నారు. 100 శాతం సర్వే ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియ కుమారి, రమీల పాల్గొన్నారు.

మంచుతో పొంచి ఉన్న ముప్పు

- కనిష్ట స్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలు
- వణికించే చలిలో వాకింగ్ వద్దు
- గుండె, శ్వాససమస్యలకు ఆస్కారం

తెల్లవారు జామున రోడ్డును కమ్మేసిన పొగమంచు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రోజురోజుకి చలి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. తీసుకునే ఆహారం నుంచి ధరించే దుస్తులు వరకు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. చలిలో తిరగడం వల్ల న్యూమోనియాతో పాటు వ్యాధులు, ఎలర్జీ వంటివి వచ్చే అవకాశం ఉందని, ఆస్తమా వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలని, నిత్యంవాడే మందులను ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి, శరీరం ఎప్పుడూ వెచ్చగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని, ఉన్ని దుస్తులు దుమ్ము, ధూళి లేకుండా చూసుకోవాలని తెలిపారు. చల్లగాల్లో మార్నింగ్ వాక్ చేస్తే ఆస్తమా ఉన్నవారు శ్వాస సరిగ్గా తీసుకోవడం కష్టమంటున్నారు. దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. మార్కింగ్ వాకింగ్‌కి వెళ్లేవారు మంచు ప్రభావం తగ్గిన తరువాత ఉదయం 8 గంటలకు వెళ్లడం మంచిదని అంటున్నారు. చలివలన వ్యాధులతోపాటు చర్య సమస్యలు రావొచ్చుఅని వైద్యులు అంటున్నారు.

కమలమ్మకు సావిత్రిబాయి పూలే పురస్కారం

ప్రజాశక్తి- సోమల: వే ఫౌండేషన్ తిరుపతి వారు తమ 11వ వార్షికోత్సవం సందర్భంగా గత ఏడాది నవంబర్ 20వ తేదీ తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన భారతీయ కళా ఉత్సవ్ వేడుకలలో భాగంగా సోమల మండలం నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు కే.కమలమ్మ తమ పాఠశాలలోని విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, నృత్య ప్రదర్శన చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 250 పాఠశాలల నుండి 36 మంది మహిళా ఉపాధ్యాయులను వారి సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవలను గుర్తించి సావిత్రిబాయి జయంతి పురస్కారాలకు ఎంపిక చేశారు. ఇందులో నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కమలమ్మ కూడా పురస్కారానికి ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ తెలిపారు. కమలమ్మకు ఈనెల 5వ తేదీ తిరుపతి మహతి కళాక్షేత్రంలో సంస్థ వారు సన్మానించి జ్ఞాపికను అందజేశారని ఈ సందర్భంగా ఎస్ఎంసి చైర్మన్, సిబ్బంది, అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించారు.

అవార్డు గ్రహీతను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

మధర్ థెరిస్సా విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి- గంగవరం: ఈనెల 5వ తేదీన విడుదలైన ఎస్వీ యూనివర్సిటీ ద్వితీయ సెమిస్టర్ ఫలితాలతో మధర్ థెరిస్సా కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల ప్రిన్సిపాల్ మధుసూధనరావు తెలిపారు. బిసిఏలో ఏఎన్.చందన 9.48, పూజిత 9.4, హంసిక 9.21, దివ్యశ్రీ 9.13, మోషిత 9.13, ఉషారాణి 9.03, బిబిఏలో దివ్యశ్రీ 9.39, డింపుల్ 9.19, సంతోష్ కుమార్ 9.04, బీకాంలో నాగవేణి 8.9, ఉషా 6.86, తనుజ 8.75, బిఎస్సీలో షేక్ ఆఫిఫా 8.71, గౌతమి 9.56 జిఎస్‌జిపిఏ సాధించి కళాశాలస్థాయిలో టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. బీకాం, బీఎస్సీ, బిసిఎ, బిబిఏ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ నందు 270 డిస్టింక్షన్లు, 140 ప్రథమ్ శ్రేణిలో ఉత్తీర్ణులైనారని తెలిపారు. విద్యార్థులను, అధ్యాపకులను కరస్పాండెంట్ రవీంద్ర బాబు, ఛైర్మన్ సునీల్, కళాశాల సలహాదారు రాజేంద్రరెడ్డి అభినందించారు.

డిగ్రీ ఫలితాలలో

ప్రతిభ చాటిన శ్రీవాణి, పద్మావతి విద్యార్థులు

S DeviSri BBA 9.39 | GowthamiB.Sc8.56 | M Poojitha BCA9.4

ప్రజాశక్తి- గంగవరం: 2024 జూలైలో జరిగిన డిగ్రీ ప్రథమ సంవత్సరం సెకండ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో యూనివర్సిటీ స్థాయిలో శ్రీవాణి, పద్మావతి కళాశాల విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని కళాశాల ప్రిన్సిపల్ కె.కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. ఈ ఫలితాలోల బిసిఏ గ్రూప్‌లో హేమావతి 86 శాతం, లక్ష్మి 84 శాతం, బిఎస్సీ కంప్యూటర్ సైన్‌లో లోహితా 86 శాతం, బి.కామ్ కంప్యూటర్స్‌లో నాగమణి 93 శాతం, గిరిజ 92 శాతం, రాజియ 90 శాతం, బి.విఓసి హార్టికల్చర్‌లో స్టెఫీ 94 శాతం, హేమలత 92 శాతం సాధించినట్లు తెలిపారు. అలాగే ఈ ఫలితాల్లో మొత్తం విద్యార్థులు 65 డిస్టింక్షన్లు, 54 ప్రథమ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అత్యధిక శాతం సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ సిపి శ్రీవాణి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి

ప్రజాశక్తి- యాదమరి: 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి సోమవారం ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతి విద్యనభ్యసించి పబ్లిక్ పరీక్షలలో మండలస్థాయిలో 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన పి.నందిని అనే విద్యార్థినికి పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న జి.కృష్ణారెడ్డి వారి తల్లిదండ్రులైన గురువారెడ్డి రాజమ్మ గార్ల జ్ఞాపకార్థం ప్రోత్సాహక బహుమతి అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా శ్రీకృష్ణారెడ్డి ఉన్నత పాఠశాల స్థాయిలో పబ్లిక్ పరీక్షలలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. గత విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన నందినికి ఉపాధ్యాయులు రూ.20వేలు నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిని తల్లిదండ్రులైన శివరాణి, దశరథన్‌లకు బహుమతి పొందిన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం నగదు ప్రోత్సాహం అందించిన ఉపాధ్యాయునికి విద్యార్థిని నందిని సన్మానం చేసి కృతజ్ఞతులు తెలిపింది.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థిని నందిని

తిరుమల వైకుంఠ ద్వార దర్శనానికి వస్తూ...

తెల్లారిన బతుకులు

ప్రజాశక్తి - చంద్రగిరి : వైకుంఠ ఏకాదశి దర్శనానికి పాదయాత్రగా వస్తున్న భక్తులపైకి 108 మృత్యురూపంలో పైకి ఎక్కింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళా భక్తులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో తులసమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చంద్రగిరి పోలీసుల వివరాల మేరకు... గుండె పోటుకు గురైన రోగిని ఎక్కించుకొని మదనపల్లి నుండి 108 వాహనం తిరుపతి రుయా ఆస్పత్రికి వస్తున్న సందర్భంలో సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో చంద్రగిరి మండలం, ఏ రంగంపేట సమీపంలో నర్సింగాపురం జాతీయ రహదారిపై అన్నమయ్య జిల్లా రామసముద్రం నుండి తిరుమలకు శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వస్తున్న శ్రీవారి భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చంపాలపల్లికి చెందిన పెద్ద రెడ్డమ్మ (40), శేగంవారిపల్లికి చెందిన లక్ష్మమ్మ(45) అక్కడికక్కడే మతి చెందారు. మరో ఐదుగురు కె.రెడ్డెమ్మ, వి.రెడ్డెమ్మ, యశోద, తులసమ్మ, రమేష్ లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చంద్రగిరి పోలీసులకు ప్రమాద ఘటన విషయం తెలియజేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు మతులు, క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బంధువులు తిరుపతి రుయా ఆసుపత్రికి చేరుకున్నారు. వైకుంఠఏకాదశి సందర్భంగా శ్రీవారిని దర్శించుకునేందుకు వెళుతూ తిరిగిరాని లోకాలకు వెళ్లారని బోరుమని విలపించారు. భక్తులను ఢీకొన్న 108 అంబులెన్స్ లోని గుండె పోటు రోగిని తిరుపతి నుంచి 108 వాహనం రప్పించి పోలీసులు ఆ వాహనంలో తిరుపతికి తరలించారు. మతదేహాలను పోలీసులు శవ పరీక్ష నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. తీవ్ర గాయాలు పాలైన ఐదుగురిలో తులసమ్మ పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. నలుగురు క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి బాగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంఎల్ఏ పులివర్తి నాని ఫోన్ ద్వారా వైద్యులను కోరారు.

మూడు పంచాయతీల్లో పింఛన్ల తనిఖీలు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి, ఆవులపల్లి, పెద్ద ఉప్పరపల్లి పంచాయతీలలో రూ.15వేలు పింఛన్లు తీసుకుంటున్న వారి వివరాలను వైద్యులు ఇతర సచివాలయ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. పలు అంశాలకు సంబంధించిన వివరాలను పింఛనుదారులను అడిగి వారు చెప్పిన వివరాలను నమోదు చేసి ఆన్లైన్ చేస్తున్నారు. వికలాంగుల పింఛన్లు కింద రూ.15 వేలు పొందుతున్న పింఛనుదారులకు నోటీసులు ఇచ్చి వైద్యపరీక్షలు చేసి నివేదికలను ఆన్లైన్లో పొందుపరుస్తున్నారు. లబ్ధిదారుల ఇండ్ల వద్దకే వెళ్లి వైద్యులు బృంద సభ్యులు వివరాలు నమోదు చేస్తున్నారు. మిగిలిన పంచాయతీలలో కూడా 15 వేల రూపాయల పింఛన్ పొందుతున్న వారి వివరాలను ఆన్లైన్లో వారు చెప్పే నివేదికల ఆధారంగా నమోదు చేయనున్నట్లు సమాచారం. నివేదికలను ప్రభుత్వానికి పంపించి వారు అర్హుల కాదా అన్న విషయాన్ని నిర్ధారించనున్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని తులసమ్మగుడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో రంగవల్లులు వేయించి భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలను కనువిందు చేశాయి. అలాగే విద్యార్థులు హరిదాసుల వేషధారణలో అలరించారు. ప్రధానోపాధ్యాయులు హరి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మన సంస్కృతిని సాంప్రదాయాలను రేపటి తరాలకు అందించడానికి ఈ ముందస్తు వేడుకలు నిర్వహించి తెలుగు పండుగలు విశిష్టతను తెలిపినట్లు తెలిపారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ మాధవి, ఉపాధ్యాయులు రషీద్ అహ్మద్, సురేంద్ర పాల్గొన్నారు.

ఎస్టీల మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి



ప్రజాశక్తి- చౌడేపల్లి: మండలంలోని ఎస్టీల మౌలిక వసతుల సాధన కోసం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తహశీల్దార్ హనుమంతు తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చౌడేపల్లి దిగువపల్లి, గడ్డంవారిపల్లి, దుర్గ సముద్రం, పెద్దకొండమర్రి తదితర పంచాయతీ గ్రామాల్లో జీవిస్తున్న ఎస్టీ కులాలకు చెందిన ప్రజలు జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు వర్తించాలంటే ముఖ్యంగా ఆధార్ కార్డులు అందించాలన్నారు. ఇప్పటివరకు ఆధార్ కార్డులు లేని ఎస్టీ కుటుంబాలకు 90 శాతంకు పైగా అందించామని ఇకపై మరిన్ని కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఇంటిస్థలాలు గృహాలు అందించేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. వీటితో పాటు ఎస్టీల కుటుంబాల్లో బాల్య వివాహాలు అరికట్టి వారిని చదువుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఎస్టీల కోసం రెవెన్యూశాఖ తరపున తలపెట్టిన పలు కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటి తహశీల్దార్ మాధవి, ఆర్ఐ.భారతి, వీఆర్వోలు పాల్గొన్నారు

సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి- చౌడేపల్లి: స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఐకెపి ఎపిఎం సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1071 మహిళా సంఘాలు ఉన్నాయని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న రాయితీ తక్కువ వడ్డీ రుణాలను అందిస్తున్నట్లు వివరించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో బిస్కెట్లు, పేపర్ ప్లేట్లు తయారీ, వంటనూనె తయారీ వంటి చిన్న చిన్న పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఫ్లిప్కార్ట్ అమెజాన్ విధంగా డోర్ డెలివరీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి సంఘంలోని మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా ప్రభుత్వపరంగా అన్ని పథకాలను వర్తింప చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిసిలు రమేష్, నాగరత్న పాల్గొన్నారు.

ఏపిడబ్ల్యూజెఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

ఏపిడబ్ల్యూజేలో సభ్యులుగా చేరుతున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత నమోదు కార్యక్రమం జిల్లా కేంద్రమైన చిత్తూరులో సోమవారం నుండీ ప్రారంభమైంది. వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సభ్యులుగా చేరేందుకు వంద రూపాయలు సభ్యతం చెల్లించి సభ్యులుగా చేరాలని యూనియన్ జిల్లా కన్వీనర్ వదరరాజులు తెలిపారు. ఈ మేరకు సోమవారం చిత్తూరు నగరంలోని జర్నలిస్టులు సభ్యత్వం పొందారు.

మొక్కలు వితరణ

ప్రజాశక్తి - సదుం: సదుం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ ఆసుపత్రి) ఆవరణలో చల్లటి నీడ, చక్కటి గాలినిచ్చే మొక్కల అవసరాన్ని గుర్తించిన సదుం మణికంఠ లయన్స్ క్లబ్ సభ్యులు 140 కానుగ, అల్లనేరేడు, వేప, చిందుగా, చెర్రీ తదితర వృక్షజాతి మొక్కలను సోమవారం వితరణగా అందజేసినట్లు సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ పి.పుష్ప కుమారి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. జయకుమార్ రెడ్డి, డాక్టర్ పుష్పకుమారి, డాక్టర్ రూపానంద్, క్లబ్ అధ్యక్షులు జి. నరసింహులు, పోస్ట్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, క్లబ్ డైరెక్టర్ ఆంజనేయులు, నాగరాజ, సిహెచ్‌సి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.